క్లుప్తంగా

మహిళలకు కుట్టుమెషీన్ శిక్షణ ప్రారంభం



మహిళలకు కుట్టుమెషీన్ శిక్షణ ఇస్తున్న దృశ్యం

వీరవాసరం: మహిళలకు కుట్టుమెషీన్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం వీరవాసరం పంచాయతీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వీరవల్లి దుర్గా భవానీ ఈ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చికిలే మంగతాయారు, గులిపల్లి విజయలక్ష్మి, బి.అప్పారావు, వీరవల్లి చంద్రశేఖర్, వేంద్ర దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మహాసభలో మాట్లాడుతున్న వెంకట్రావు

భీమవరం: ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు అన్నారు. రైస్‌మిల్ వర్కర్స్ సీపీఐ శాఖా మహాసభ భీమవరంలో బుధవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పాలా త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో శాఖ కార్యదర్శిగా పి.యాకోబు, మరో ఐదుగురితో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, పాలా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

పాత బస్టాండ్ అభివృద్ధికి కృషి



పాతబస్టాండ్ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పాత బస్టాండ్ నూతన కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు తెలిపారు. బుధవారం భీమవరం పాత బస్టాండ్ ప్రాంగణంలో రామాంజనేయులు, జిల్లా జాయింట్ కలెక్టర్, భీమవరం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాత బస్టాండ్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. పాత బస్టాండ్ శిథిలావస్థకు చేరుకోవడంతో దాతలు సీహెచ్ రామ్ బద్రిరాజు రూ.30 లక్షలు ఖర్చు చేసి నూతన బస్టాండ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ముందుకు వచ్చారని అభినందించారు. కార్యక్రమంలో ఫణి కుమార్ వర్మ, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.


కోలాహలంగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠ



రామాలయంలో ఏర్పాటు చేసిన నూతన విగ్రహాలు

ఆకివీడు: స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద రాములోరికి కొత్త శోభ సంతరించుకుంది. పురాతన విగ్రహాలను, ఆలయాన్ని గోదావరిలో నిమజ్జనం చేసిన అనంతరం నూతన ఆలయం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం కోలాహలంగా నిర్వహించారు. మహాబలిపురంలో తయారు చేసిన నూతన విగ్రహాలను ఉదయం ప్రతిష్ఠించారు. ఆలయ నిర్మాణ కర్తలు భీష్మ, హరి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలో పాల్గొన్నారు. అనంతరం సుమారు 2 వేల మందికి అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

నిర్వాసితులకు భోజన శిబిరం



భోజన శిబిరంలో వడ్డిస్తున్న సీపీఎం నాయకులు

పాలకోడేరు: స్థానిక ఏఎస్‌ఆర్ నగర్‌లో ఇళ్లు కూల్చివేతతో రోడ్డును పడ్డ నిర్వాసితులకు సీపీఎం ఆధ్వర్యంలో భోజన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర సీనియర్ నేత మంతెన సీతారాం మాట్లాడుతూ నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకునేంతవరకు ఈ శిబిరానికి కొనసాగిస్తామని సీతారాం అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్, జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, కె.క్రాంతి బాబు, శేషపు అశ్రియ్య పాల్గొన్నారు.

పదిలో ప్రభుత్వబడుల ప్రతిభ

ఉండి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించారు. బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో తమ హవా చూపారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చేపట్టిన ఇంగ్లిషు మీడియం ఫలాలు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నిలబెట్టాయి. మండలంలోని 8 జెడ్పీ హైస్కూల్స్ పరిధిలో కోలమూరు పేరిచెర్ల కృష్ణప్రసాద్ మెమోరియల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సుంకర తేజశ్రీ 585 మార్కులతో మండల ప్రథమస్థానం సాధించింది. అలాగే యండగండి గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థిని తీపర్తి వీజే ప్రసన్నలక్ష్మి 571 మార్కులు, ఉప్పులూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి జొన్నల వరప్రసాద్ 562 మార్కులను సాధించారు. ఉండి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గ్రంధి లక్ష్మీనారాయణ శ్రీయశ్వంత్ 559 మార్కులు సాధించాడు. ఇక ప్రైవేటు స్కూల్స్ విషయానికి వస్తే ఇండియన్ డిజిటల్ స్కూల్ విద్యార్థి కలిశెట్టి సత్యసాయికృష్ణప్రభాస్ 590 మార్కులు, యండగండి చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు చెందిన సత్తినీడి నాగసాయి 584 మార్కులు సాధించారు. మండలంలోని ప్రభుత్వ హైస్కూల్స్ 8, ప్రైవేటు స్కూల్స్ నాలుగు మొత్తం 12 హైస్కూల్స్‌కు గానూ ఒక్కటంటే ఒక్కస్కూల్ కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించలేకపోయాయి. నూరు శాతం ఫలితాల సాధనలో ప్రభుత్వ పాఠశాలలు ఈ యేడాది చాలా వెనుకబడిపోయాయి. ప్రైవేటు పాఠశాలల్లో 149 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 12 మంది విద్యార్థులు మాత్రమే ఫెయిల్ అయ్యారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో 449 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 124 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

కాళ్లలో..

కాళ్ల: పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పది ఫలితాల్లో కాళ్ల మండలంలో 77 శాతం ఉత్తీర్ణులయ్యారు. కాళ్ల మండలంలో 21 గ్రామాల్లోని 9 జెడ్పీ హైస్కూళ్లు, 2 ప్రైవేటు హైస్కూళ్లకు చెందిన మొత్తం 674 మంది పరీక్షలు రాయగా 520 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని కాళ్ల హైస్కూల్లో చదివిన గ్రామానికి చెందిన విద్యార్థిని నిమ్మల యశశ్విని, కోపల్లె హైస్కూల్ విద్యార్థిని సాధనాల లిఖితదుర్గ లు 586/600 సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించారు. వీరిద్దరూ ఇంజనీరింగ్ అవ్వాలనే కోరిక ఉన్నట్లు తెలిపారు.



సుంకర తేజశ్రీ



తీపర్తి వీజే లక్ష్మీప్రసన్న



నిమ్మల యశశ్విని



సాధనాల లిఖితదుర్గ



కొల్లి సాన్విని అభినందిస్తున్న మన్నే లలితాదేవి



ప్రవల్లిక శ్రీ



వై.లాస్యశ్రీసాయి



ఏఎస్ఎస్‌వీఆర్ కార్తీక్



కె. యశస్విని



తిరుమల విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఆకివీడులో..

ఆకివీడు పదోవ తరగతి పరీక్షల్లో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాన్ని ఆకివీడు జెడ్పీ స్కూల్ విద్యార్థిని కొల్లి సాన్వి 590 మార్కులతోనూ, 7వ స్థానంలో సిద్ధాపురం జెడ్పీ స్కూల్ విద్యార్థి వాతాడి ప్రభాకరరావు 587 మార్కులతో నిలిచారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితియ స్థానాలు పొందగా తృతీయ స్థానంలో ఆకివీడు జెడ్పీ స్కూల్ విద్యార్థి కె.మణికంఠ 580 మార్కులతో నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థుల్ని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్, నగర పంచాయతీ కోఆప్షన్ సభ్యురాలు మన్నే లలితాదేవి అభినందించారు. మండలంలోని సిద్ధాపురం జెడ్పీ స్కూల్ విద్యార్థి వాతాడి ప్రభాకర్ జిల్లా స్థాయి టాపర్లలో ఏడో స్థానం కైవసం చేసుకోవడం పట్ల మండల వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రటరీ భూపతిరాజు బుజ్జిరాజు అభినందించారు. ప్రైవేటు విద్యా సంస్థలో నారాయణ విద్యార్థిని ఎం.నితిష్ 594, సెంట్‌ఎలిషియస్ విద్యార్థి టీ.యజ్ఞ 593, విజ్ఞాన్ స్కూల్ విద్యార్థి బుంగా హన్షిత తృతీయ స్థానం కైవశం చేసుకున్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని మొత్తం విద్యార్థులు 865 మంది హాజరుకాగా, 747 మంది ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు

పాలకోడేరులో..

పాలకోడేరు: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ప్రకటించిన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో పాలకోడేరు మండలానికి సంబంధించి పాలకోడేరు ఉన్నత పాఠశాలకు చెందిన బి.ప్రవల్లిక శ్రీ 577 మార్కులతో ప్రథమ స్థానం పొందినట్లు మండల విద్యాశాఖ అధికారి పీవీ శివ నాగరాజు తెలిపారు.

వేంద్ర ఉన్నత పాఠశాలకు చెందిన కేతా సుమ, రేలంగి భరత్ కుమార్ 572 మార్కులతో ద్వితీయ స్థానం, విస్సాకోడేరు ఉన్నత పాఠశాలకు చెందిన కె.తేజస్విని 570 మార్కులతో తృతీయ స్థానం పొందినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉత్తీర్ణత 65 శాతం నమోదైనట్లు తెలిపారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: పది పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హవా చూపారని మండల విద్యాశాఖాధికారి గ్రేడ్ –1 ఎన్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో 12 జిల్లా పరిషత్ పాఠశాలలు, 8 ప్రైవేట్ పాఠశాలల నుంచి 859 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 749 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి చినఅమిరం జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థి ఏఎస్ఎస్ వీఆర్ కార్తీక్ 589 మార్కులు సాధించిన ప్రథమ స్థానం, గూట్లపాడు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి వారణాసి శరణ్ కుమార్ 576 మార్కులతో ద్వితీయ స్థానం, దిరుసుమర్రు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి కె.యశస్విని 561 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారన్నారు.

భీమవరంలో విద్యార్థుల హవా



జి.తేజశ్విని



పి.నందమణి కిషోర్



ఎండీ నవాజ్

భీమవరం: స్థానిక మెంటేవారితోటలోని వండర్ కిడ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. గూడవల్లి తేజశ్విని 582, పి.నందమణి కిషోర్ 571, ఎండీ నవాజ్ 559 మార్కులతో ప్రతిభ చాటారు. 98 శాతం ఉత్తీర్ణతతో పాఠశాల విద్యార్థులు ఫలితాలు సాధించారని పాఠశాల డైరక్టర్లు అల్లు రామకృష్ణ, వనజాక్షి కుమారి, అల్లు వంశీకృష్ణ, విజయభాగ్య లక్ష్మి, టి.వాణి తెలిపారు. అలాగే ఫలితాల్లో భీమవరం తిరుమల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని విద్యాసంస్థ డైరెక్టర్లు ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్‌బాబు చెప్పారు. తమ విద్యార్థి వై.లాస్యశ్రీసాయి 597 మార్కులతో జిల్లాలో ప్రథమస్థానం సాధించగా ఏజే లక్ష్మీదివ్య 595, బీఎస్ జెనీథ 594, జీఎస్ఎన్‌వీ సాయిసృజిత్, పి.సుదీప్తి, పి కార్తీక, సిహెచ్ ధృతిశ్రీ, వి.పద్మసాహితి, కె.కార్తీక, కె.జాహ్నవి 592 మార్కులు సాధించారన్నారు. జీపీ తేజకుమార్, కె.అవినాష్ 591, వై.తేజసాయివంశీ, ఎస్.పూజిత 590 మార్కులు సాధించినట్లు చెప్పారు. 14 మంది విద్యార్థులు 590 పైగా మార్కులు సాధించగా 44 మంది 585 పైగా, 84 మంది 580 పైగా, 170 మంది570 పైగా మార్కులు సాధించినట్లు వివరించారు.

పుస్తకాలతో విజ్ఞానం

భీమవరం (ప్రకాశంచౌక్): విజ్ఞానాన్ని పంచడంలో పుస్తకాలు ప్రథమ భూమికను పోషిస్తాయని, పుస్తకాలను అందజేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకుని సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మానవత సేవా సంస్థ కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, మిర్చిపాటి గున్నేశ్వరరావులు కాంపిటేటివ్ ఎగ్జామ్ లకు ప్రిపేర్ అయ్యే వారికి చదువుకునేందుకు ఉపయోగపడే డీఎస్సీ, ఆర్‌ఆర్‌బీ, గ్రూప్స్ సంబంధించిన పుస్తకాలను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి అందజేశారు. ఈ పుస్తకములను జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో ఆవిష్కరించి భీమవరం వీరమ్మ పార్కు వద్ద ఉన్న భీమవరం శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ ఎస్.వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోటీ పరీక్షల పుస్తకాలను అందచేస్తున్న దృశ్యం

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో

భీమవరం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పుస్తకాలు పిలుస్తున్నాయ్ అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం భీమవరంలో పుస్తక వారోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపిమూర్తి మాట్లాడుతూ సమాజం త్వరిత గతిని మార్పు చెందాలంటే పుస్తక పఠనమే మార్గమని తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు, కోశాధికారి మల్లుల శ్రీనివాస్, వై.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభం

ఉండి: దళితులు అన్ని రంగాల్లోను ముందుండాలని మాలమహానాడు రాష్ట్రాధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు.బుధవారం ఉండిలో వీబీ హెల్త్‌కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొర్లపాటి భాగ్యరాజు, ఈతకోట విజయ్ సంయుక్తంగా హెల్త్‌కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇంటి సుందర్‌కుమార్, నేతల సువర్ణరాజు, చిరుగుపాటి రాజేష్, నేతల సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

కాళ్ల: ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ పెన్మెత్స శిరీషవిశ్వనాథరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని సూచించారు. అనంతరం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ ప్రజా ప్రతినిధులు అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మన్నే నాగలక్ష్మి, ఎంపీడీఓ జి.స్వాతి, ఏఈలు పి.రాంబాబు, ఫణిశంకర్, లీలాప్రసన్న, ఎంఈఓ రవీంద్ర, డాక్టర్లు ఎస్.సునీల్, చంద్రబాబు, ఏఓ జయవాసుకి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్మెత్స శిరీష

పహల్గాంలో ఉగ్రదాడి దారుణం



భీమవరంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

భీమవరం: పహల్గాంలో ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కశ్మీర్‌లో అరాచకం సృష్టిస్తున్న ఉగ్రవాదులు పర్యాటకులపై తెగబడి 28 మంది ప్రాణాలు బలిగొనడం దారుణమన్నారు. జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ కశ్మీర్‌లో దాడి చాలా బాధాకరం, హేయమైన చర్య అన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఇంజేటి శ్రీను, మల్లిపూడి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

ఏబీవీపీ ఆధ్వర్యంలో

ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నారాయణ కళాశాల వద్ద పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పూర్వ కార్యకర్త, ఆర్ఎస్ఎస్ వీరవాసరం ప్రముఖ్ పెన్నాడ రమేష్ మాట్లాడుతూ సైన్యాన్ని నేరుగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక దాడికి పాల్పడం దారుణమన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా దేశంలోని ప్రతి భారతీయుడూ కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు రావాలన్నారు. ఉగ్రదాడులు పిరికిపంద చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఏబీవీపీ భీమవరం విభాగ్ కన్వీనర్ కాయిత డిన్ను చందు, జిల్లా కన్వీనర్ రాయి వెంకట్, శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఇనుప రాడ్డుతో దాడి

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఎస్‌ఆర్ నగర్‌లో ఓ వ్యక్తి ఇనుపరాడ్డుతో వీరంగం సృష్టించాడు. దుకాణం షట్టరు నుంచి శబ్దం వస్తుందంటూ కె.విజయప్రసాద్ అనే వ్యక్తి, దుకాణ యజమాని బొండాడ నర్సింహరావుపై దాడి చేయగా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

చదువుతోపాటు వృత్తి విద్యలో రాణించాలి

కాళ్ల: విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే కోర్సులను ఎంచుకొని చదువుతో పాటు వృత్తి విద్య లో కూడా రాణించాలని కలవపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం జె.సీతారామమూర్తి తెలిపారు. కలవపూడి గ్రామంలో ఉన్న వేటుకూరి వెంకట సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య కోర్సులు పాల్గొన్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. పది రోజులు పాటు నిర్వహించిన వృత్తి విద్య కోర్సులో వృత్తి నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకున్నారని సీతారామమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు పొందిన విద్యార్థులను అభినందించారు.

వెంకన్నకు వైభవంగా అభిషేకాలు



స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి అష్టోత్తర శతకలస ఇక్షురసాభిషేకం (108 కలశాల చెరుకు రసాలతో అభిషేకాలు) నిర్వహించారు. బుధవారం భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అధ్యక్షులు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. చల్లగండ్ల సత్యనారాయణ, సుజాత దంపతులు, చల్లగండ్ల రాహుల్ సాయి, సాయి లాస్య దంపతులతో శ్రీవారికి అష్టోత్తర శతకలస ఇక్షురసాభిషేకం (108 కలశాల చెరుకు రసాలతో అభిషేకాలు) నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి కుక్కల బాల, సరిపడకల రామారావు, జానపాటి మధు, పెన్నడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, అల్లు రామారావు, కడలి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.